ఒక మహా నగరంలో బిజీగా వున్న బజారులో ఫుట్ పాత్ మీద నిల్చుని ఉన్నాడు ఓ పధ్నాలుగేళ్ళ బాలుడు. నల్లటి రంగు, బక్క చిక్కిన శరీరం, అంగుళం మందాన దుమ్ము పట్టిన కాళ్ళు, లోతుకు పోయిన కళ్ళు ఉన్న యాదయ్య తన చుట్టూ ఉన్న ప్రపంచాన్నంతటినీ కబళించి వేయాలన్నంత ఆకలితో, ఆశతో రొడ్డుమీద వచ్చేపోయే జనాన్ని చూస్తూ నిల్చున్నాడు.

ఎలక్ట్రిక్ దీపాలతో దేదీప్యమానంగా వెలిగిపోతోంది నగరం. పెద్దకార్లు, చిన్న కార్లు, సిటీబస్సులు, ఆటోలు, రిక్షాలు. జనం అటు నుంచి యిటు. యిటు నుంచి అటూ సందడిగా పోతున్నారు. ఆ వేగాన్ని వెలుతురునీ చూస్తుంటే యాదయ్య గుండెలో ఏదో ఆరాటంగా ఉంది. ఆ వేగాన్ని తానుకూడా అందుకోవాలనీ, ఆ వెలుగును తన జీవితంలో నింపుకోవాలని ఏవేవో కోరికలు అతని లేత గుండెలో అలజడి చేయసాగినయ్.

ఫుట్ పాత్ కి అవతల కొద్దిదూరంలో ఒక చెట్టుక్రింద యాదయ్య తల్లి సీతాలు మూలుగుతూ పడుకుని ఉంది. ఉండుండి దగ్గు పొరలమధ్య "ఒరే యాదిగా, ఏడకి పోయినావురా?" అంటూ తనలో తాను గొణుక్కుంటున్నట్టు కేకవేస్తోంది.

యాదయ్యకి తల్లి దగ్గు, మాటలు వినపడుతూనే ఉన్నాయ్. కాని అతని మనస్సు మాత్రం అటువైపు లేదు. కారలో, రిక్షాలలో పోతున్న ఖరీదైన మనుషులనే చూస్తున్నాడు తదేకంగా.

తెల్లగా సన్నగా పాలరాతి బొమ్మల్లా మెరిసిపోతున్న ఆడవాళ్ళు ఖరీదైన సూట్లలో, లాల్చీ పంచల్లో ఐశ్వర్యానికి ప్రాణం వచ్చినట్లు కినబడుతున్న పురుషులు ఆరోగ్యంగా, ఆనందంగా మిడిసిపడుతున్న పిల్లలు! ఓహ్, ఎంత అదృష్టవంతులువాళ్లు!

"ఆ పిలలలో తాను కూడా ఒకడైతే .. ఎంత బాగుండును!" అనుకుంటున్నాడు యాదయ్య.

'ఖంగ్ 'ఖంగ్' మంటూ వినపడుతున్న తల్లి దగ్గు అతని ఆలోచనలను చెదరగొడ్తోంది. "యాదిగా.. యాదిగా.. అంటున్న ఆమె కంఠధ్వని అతని గుండెను మెలిపెడ్తోంది. ఐనా యాదయ్యలో చలనం లేదు.

బొమ్మలాగా నిలబడి తన కళ్ళ యెదుటి మనుషులను, వాహనాలను తనివి దీరా చూస్తున్నాడు.

ఆ లేత మెదడులో ఎన్నో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయ్.

ఆ లోతైన కళ్ళల్లో ఎన్నో కలలు నిండుకుంటున్నాయ్.

తనుకూడా ఆ పిల్లల్లాగా ఖరీదైన బట్టలు వేసుకుని అలా కార్లల్లో తిరగాలంటే తనకి డబ్బుకావాలి. కాని డబ్బు ఎలా వస్తుంది? ఎలా వస్తుంది?

పనిచేసి అంత డబ్బు సంపాదించడానికి తనకి తగినంత వయసులేదు. దొంగతనం చేసే ధైర్యం లేదు. ఆ పనులు చేతకావు కూడా.

దొంగతనం చేసినట్లు అనుమానం తగిలితే చాలు పోలీసులు లాకప్పులో పెట్టి నానా హింసలూ పెడ్తారట. వాళ్లు కొట్టే దెబ్బలకు తట్టుకోలేక దొంగతనంచెయ్యని వాళ్ళుకూడా చేసినట్లు ఒప్పుకుంటారట-వాళ్ళు. పిళ్ళు చెప్పుకోగా వింటుంటే యాదయ్యకి వళ్ళు జలదరించేది.

"తిండిలేక చావనైనా చస్తాను గాని ఆ దెబ్బలు మాత్రం భరించలేను" అనుకున్నాడు అప్పుడు

అందుకే దొంగతనం చెయ్యడమంటే చచ్చే భయం యాదయ్యకి.

మరైతే డబ్బు సంపాదించటం ఎలా?

"ఒరే యాదిగా! ఇంకెంత సేపు నించుంటావురా? రా! వచ్చి తొంగో" అంటూ తల్లి కేకేసింది. మరుక్షణమే దగ్గుతెర అడ్డువచ్చి మెలికలు తిరిగిపోయింది.

యాదయ్యకింక కదలక తప్పలేదు.

తల్లి దగ్గరికెళ్ళి నీళ్ళ ముంత తల్లి నోటికందించేడు.

నీళ్ళు తాగేక కాస్త దగ్గు సర్దుకుంది.

యాదయ్య కూడా కాసిని నీళ్ళుతాగి తల్లి పక్కనే ముడుచుకుని పడుకున్నాడు.

సీతాలు యాదయ్య వంటిమీద చెయ్యి వేసి ప్రేమగా నిమిరింది. "ఏందిరా పిచ్చి సన్నాసి? ఆడ అంతసేపు నిల్చుండి ఏం సూత్తున్నావురా?" అంటూ గోముగా అడిగింది.

"ఏం నే దె సి. మోటర్లను, మడుసులను సూత్తున్నాడు.

"ఊరికే ఆ మడుసులను సూత్తే ఆళ్ళ సిరి మనకొత్తుందిటరా. నీ యెర్రిగాని" అంది నిటూరుస్తూ సీతాలు.

"ఎందుకు రాకూడదు? మనేం పాపం సేసినామని యిలా తిండికి మాడిసావాలి? ఇయ్యాల కాకపోతే రేపైనా నేను ఆళ్ళంత డబ్బు సంపాదిస్త. సూస్కో" అన్నాడు పౌరుషంగా యాదయ్య.

కొడుకు రోషం చూసి మురిసిపోయింది సీతాలు.

"నా కొడుకే .." అంటూ మెటికవిరిచి వాడికి ముద్దు పెట్టుకుంది. మళ్ళీ వెంటనే "మనకంత అదురుష్టంకూడాన్నా- ఆళ్ళ దేవుడు పెట్టిపుట్టినారు. మనమెక్కడ ఆళ్ళెక్కడా" అంది నిస్పృహగా.

"ఆళ్ళకంత డబ్బుయాడినుంచొచ్చిందే" అనడిగేడు తల్లిని.

"బగమంతుడిచ్చేడు."

"నువ్వూర్కోవే, బగమంతుడేడన్నా మడుసులకు డబ్బిత్తాడే" తల్లి సమాధానం నచ్చక ఆమె మీద విసుక్కున్నాడు యాదయ్య.

"పూరవ జలమలో ఆళ్ళు పున్నెం సేసుకున్నారు. అందుకే దనమంతులయ్యారు. మనం పాపం సేసినాం గన్క యిట్టగున్నాం."

ఎప్పుడో ఏ జన్మలో నో పుణ్యం చేసినంత మాత్రాన ధనవంతు లవుతారనటం అంత నమ్మశక్యంగా లేదు యాదయ్యకి. ఈ జన్మలో ఏ ప్రయత్నం చెయ్యకుండానే అంత డబ్బు వస్తుందా?

కేవలం ఎప్పుడో చేసిన పాపానికి ఫలితంగా యిప్పుడు తను తిండీ గుడ్డా లేకుండా రోడ్ల వెంబడి తిరగవలసిన స్తోందంటే ఏడుపువచ్చింది యాదయ్యకి. భగవంతుడు దీనులను కాపాడతాడనీ, పాపులను ప్రేమిస్తాడనీ అంటారే. మరి తమని క్షమించకుండా వచ్చే జన్మలో బాధపడండంటూ తమనిలా పేదవాళ్ళుగా భూమి మీదకు విసిరేసే దెందుకో!


ఆ రాత్రల్లా యాదయ్య ఆలోచనలతో కలత నిదురపోయేడు. ఆ రాత్రేకాదు ప్రతి రాత్రి యాదయ్య పడుకోబోయే వరకు తీవ్రంగా ఆలోచిస్తూనే ఉంటాడు.

ఎలాగైనాసరే డబ్బు సంపాదించాలి. తల్లి దగ్గు నయంచెయ్యాలి. తల్లియేమాత్రం కష్టపడకుండా కూర్చోవాలి. తను సూటు వేసుకుని కార్లో తిరగాలి. తను కార్లల్లో చూసేపాలరాతి బొమ్మలాంటి అమ్మాయిని పెళ్ళాడాలి. ఇవే అతని కలలు.

ప్రతిరాత్రి తన కోరికలు సఫలమయినట్లు కలలు కనటం, తెల్లవారేసరికి అడుక్కునే జోలి, నీళ్ళముంత, దగ్గుతున్న తల్లీ అతని కంటబడటం-అతనికి మామూలే.

ఉసూరుమంటూ తల్లీ కొడుకులు చెరొకవైపుకువెళ్ళి బంగళాల దగర నిలబడి అన్నం రొట్టెముక్కలు అడుక్కోటం-బస్టాపుల దగ్గరనిలబడి చిల్లర పైసలు అడుక్కోటం వారి కార్యక్రమం

రాత్రయినాక ఫుట్ పాత్ మీద నిలబడి




# డబ్బుకోసం

జి. పరిమళా సోమేశ్వర్

వచ్చేపోయే వాహనాలను, జనాన్ని చూసి, అలసిపోయేక తల్లి దగ్గర ముడుచుకుని పడుకుని కలలు కంటూ రాత్రంతా గడుపుతాడు యాదయ్య.

అడుక్కునేటప్పుడు అతని కంటిని ఆకర్షించే వాటిలో సినిమా వాల్‌పోష్టర్లు ముఖ్యమైనవి, పిస్తోళ్ళు పుచ్చుకున్న మగవాళ్ళను శరీరంలోని వంపు సొంపులన్నీ ప్రదర్శించే ఆడవాళ్ళను రంగు రంగుల బొమ్మల్లో చూస్తుంటే మతిపోయేది ఆ పధ్నాలుగేళ్ళ కుర్రాడికి,

తనుకూడా ఆ బొమ్మల్లోని మగవాళ్ళలా పిస్తల్ పట్టుకుని దుర్మార్గులందరినీ టప టప మని చంపెయ్యాలని ఆ అమ్మాయిలను ముద్దు పెట్టుకోవాలనీ ఏమేమో ఊహించుకునేవాడు.

ఆ బొమ్మలు మనుషుల్లానే ఆడుతుంటే జనం చూస్తారట. తనుకూడా చూస్తే ఎంత బాగుండును!

పూటకి గతిలేదుగాని తన బతుక్కింక సినిమా కూడానా!

ఎన్నో రోజులు గంటల తరబడి సినిమా హాలు గేటు ముందు నిలబడి సిన్మాకి వచ్చేపోయే జనాన్ని చూస్తూ నిలబడేవాడు యాదయ్య. లోపలికి వెళ్ళాలంటే దేవలోకంలోకి వెళ్ళినట్లుగానే భావించి భయంతో. ఆరాధనతో, కుతూహలంతో చూస్తూండేవాడు, బయటున్న వాల్‌పోస్టర్లలోని బొమ్మలను చూసి తృప్తిపడేవాడు.

అదే విధంగా రోజులు గడిచిపోతున్నయ్.

ఆ రోజు కూడా మామూలుగానే తెల్లవారింది. ఎప్పటిలాగానే కలలుకని చివరికి ఆ కలలు కల్లలేనని తెలియజేసే తన పరిసరాలను చూసేడు యాదయ్య.

డబ్బు సంపాదించాలన్న అతనిలోని బలమైన కోర్కె తీరే మార్గం ఆరోజే ప్రారంభమవుతుందని అతనికేమాత్రం తెలియదు. మామూలుగానే తల్లీ కొడుకులు చెరో జోలె పట్టుకుని అడుక్కోవటానికి బయల్దేరేరు.

మధ్యాహ్నం బస్టాపు దగ్గర అడుక్కుంటూండగా తనని ఒక ఇరవై సంవత్సరాల యువకుడు పరిశీలనగా చూస్తున్నట్లు గమనించేడు యాదయ్య.

ఆ యువకుడు మాసిన బట్టలు వేసుకున్నా దృఢంగా, బలంగా ఉన్నాడు. అతని ముఖం. అతని కళ్ళతీరూ అదీ చూస్తుంటే 'బాగా ఆరి తేరిన మనిషిలా' ఉన్నాడు.

"దాదాలాగున్నాడు. నా దిక్కెందుకు సూత్తున్నాడో? ఏదైనా దొంగతనం జేసినా మీదెట్టాలని సూత్తున్నాడేమో" ననుకుంటూ అతని చూపుల నుంచి తప్పించుకుని వడివడిగా అక్కడ నుంచి కదిలేడు యాదయ్య.

బసాపు దాటి పదడుగులు వేసేడో లేదో ఒకబలమైన చెయ్యి అతని భుజం మీద పడి అతనిని నిలబెట్టింది.

"ఏంది? నన్ను పట్టుకున్నా వెందుకు" గజగజ వణికిపోతూ అడిగేడు యాదయ్య. తనని పట్టుకున్నది "ఆ మనిషే"నని గుర్తించేక-

"ఏరా యాదయ్యా! కూలికొస్తావా?" సాధికారంగా అడిగేడా మనిషి.

"నా పేరు ... నా పేరు-నీకెట్ట తెలుసు?" ప్రాణాలు కుంగిపోతుండగా అడిగేడు యాదయ్య.

"ఆర్నీ. ఆమాత్రం తెలియదట్రా నాయాలా. ఈపట్నంలో ఎవుడెవడో. ఎవరి పేరేందో, ఊరేందో అన్నీ నాలికమీదనే ఉంటయ్ నాకు. వయసొత్తుంటే యింక యిట్టానే గోచెట్టుకుని అడుక్కు తింటావురా! ధూ! సిగ్గులేని నాయాల. నువ్‌గూడా మొగోడివేరా?" అంటూ ప్రేమగా తిట్టేడు, ఆ మనిషి పేరు చంద్రం.

అకారణంగా తనమీద కురుసున్న ఆ "ప్రేమ తిట్ల"కు తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరయ్యేడు యాదయ్య.

నడురిచ్చాయెక్కు" అంటూ జబర్దస్తీగా యాదయ్యని రిక్షా ఎక్కించి తీసుకుపోయేడు చంద్రం.

యాదయ్యకంతా అయోమయంగా ఉంది. కలలోలాగా ఉంది ఐనా ఏ మూలో ఆనందం మినుకుమినుకుమంటూ తొంగి చూస్తూనే ఉంది.

ఇన్నాళ్ళు "కూలిప్పించండి బాబూ!" అని బతిమాలితే కసిరికొట్టే మనుషులను చూసేడుగాని పిల్చి కూలిప్పించే ధర్మాత్ముణ్ణి యిప్పుడే చూస్తున్నాడు యాదయ్య.

కూలికోసం రిక్షామీద పోవటం మరి విచిత్రంగా ఉంది యాదయ్యకి. "అంటే అంత కూలి ముట్టుందన్నమాట!"

యాదగిరి గుండె గుబగుబలాడింది. కూలిపనికి రిక్షా మీద పోయేంత అదృష్టవంతుడైనందుకు తనని తానే అభినందించుకున్నాడు.

పోయి పోయి రిక్షావాడు సముద్రపు రేవు దగ్గర వదిలిపెట్టేడు.

రిక్షా దిగగానే చంద్రం రిక్షా అతనికి డబ్బు లివ్వకుండానే లోపలికి నడిచేడు. 'చంద్రంకి ఈ రిక్షా వాళ్ళందరూ దడుస్తారు కాబోలు! చంద్రం అంత పెద్ద 'దాదా' కాబోలు' అనుకున్నాడు యాదయ్య అతని వెంట నడుస్తూ.

"ఇంకొక అర్ధగంటలో ఓడొస్తుంది. ఓడలో పెద్దపెద్ద పెట్టెలు, మూటలు వస్తాయి. వాటిని మోసుకొచ్చి లారీలో వెయ్యాలి. కూలి యెంతో తెలుసా? పది రూపాయలు" అన్నాడు చంద్రం.

యాదయ్య తన చెవులను తాను నమ్మలేకపోయేడు. "ఏందీ పది రూపాయలా!" నోరెళ్ళబెట్టి బైటికి అనకుండా నిగ్రహించుకోలేకపోయేడు యాదయ్య.

చంద్రం నవ్వేడు గొప్పగా. ఆ పది రూపాయలూ తనే యిస్తున్నట్టు పోజు పెట్టేడు.

ఈ రోజుతో తన జీవితంలోని కష్టాలన్నీ తొలగిపోవటం ప్రారంభిస్తాయనుకున్నాడు యాదయ్య.

కాసేపటికి ఓ పది మంది కూలీలు వచ్చేరు చంద్రం దగ్గరకు. వాళ్ళందరికీ చంద్రం "నాయకుడు" లా ఉంది. అందరూ అతనిని చూడగానే "నమస్తే" చెప్పున్నారు.

మరి కాసేపటికి టోపీ పెట్టుకుని సిల్కు లాల్చీ, గ్లాస్కో పంచ వేసుకున్న ఒక సేఠ్‌జీ వచ్చేడు అక్కడకు. అతని పేరు హీరాలాల్.

హిరాలాల్‌ని చూస్తూనే చంద్రంతో సహా కూలీలందరూ భక్తిగా నమస్కరించేరు.

యాదయ్య కూడా నమస్కరించేడు.

'ఏదేనా కొత్త కూలీ!" అని హిందీలో అడిగేడు హీరాలాల్.

చంద్రం ఔనని చెప్పాడు.

"నమ్మకంగా పనిచేసావా!"

చేస్తానన్నటు తలూపాడు యాదయ్య.

"నాకు తెల్దా బాబూ మీ కెట్టాంటి వాళ్ళు కావాలో." అన్నాడు చంద్రం తెలుగులో.

హీరాలాల్‌కి తెలుగు మాటాడటం రాదు కాని అర్థం చేసుకోగలడు. అల్లాగే చంద్రం హిందీ అర్థం చేసుకుంటాడు గాని మాట్లాడలేడు. ఐనా వాళ్ళిద్దరి సంబంధం మూడు సంవత్సరాలుగా ఎలాటి ఆటంకాలూ లేకుండా సాగిపోతూనే ఉంది.

ఓడ వచ్చే టైము సమీపించే సరికి కస్టమ్సు ఆఫీసరులు, మఫ్టీలో ఉన్న పోలీసు అధికారులు, సేఠ్‌జీలు అందరూ అక్కడికి చేరుకున్నారు. హీరాలాల్ లాటి సేఠ్‌జీలు యింకా నలుగురైదుగురు ఉన్నారని వాళ్ళకుకూడా ఒక్కొక్కళ్ళకీ పది పన్నెండు మంది కూలీలున్నారని తెలిసింది యాదయ్యకి.

ఓడ రేవులో ఆగగానే జనంలో కలకలం బయలుదేరింది. సేఠ్‌జీలు అందరికన్నా హడావిడిగా తిరుగుతున్నారు. అధికారుల యెడల అతి విధేయత చూపుతున్నారు. కూలీలకు కనుసైగలు చేస్తున్నారు. ఓడనుంచి దింపిన వస్తువులను అధికారులు చెక్ చేసి వదిలేసరికి గంటపైగా పట్టింది.

తోటి కూలీలతోపాటు యాదయ్యకూడా పెట్టెలను మోసి లారీలో వేసేడు. ఆ పని పూర్తయేసరికి మరోగంట పట్టింది.

సేఠ్‌జీ చంద్రం చేతికి నోటు యిచ్చేడు. చంద్రం తలా పదిరూపాయిలూ యిచ్చేడు. మిగిలిన నోట్లను తన జేబులో పెట్టుకున్నాడు.

పది రూపాయల నోటును ఆనందంతో వణుకుతున్న చేతులతో పట్టుకున్నాడు యాదయ్య.

పది రూపాయలు! పది రూపాయలు!

కలలోతప్ప ఎన్నడూ అంత డబ్బును కళ్ళ జూడలేదు యాదయ్య. ఎప్పుడు అమ్మదగ్గర వాలామా, ఎప్పుడానోటును ఆమెకు చూపిద్దామా అని తహతహలాడసాగాడు.

అప్పటికే సాయంత్రమయింది. నడుచుకుంటూ పోతే గంటపైగా పడ్తుంది. రిక్షాలో పోతే బాగుండు ననుకున్నాడు. అంతకు ముందే రిక్షాలో కూర్చుంటే కలిగే హాయిని అనుభవించి ఉండటం వల్ల, కాని రిక్షాకి కనీసం రూపాయన్నా యివ్వవలసి వస్తుంది. పదిలో ఒక రూపాయిపోతే అమ్మకి నోటు చూపించటం ఎలా? అందుకే పరుగు పరుగున అమ్మదగ్గరకు బయలేరేడు. చుట్టూ రోడ్డు మీద జనం తనని చూస్తున్నారనే సంగతికూడా గమనించకుండా రోడ్ల వెంబడి పరుగెత్తాడు యాదయ్య.

రొప్పుకుంటూ వచ్చిన కొడుకుని చూసి వాడికోసమే ఎదురుచూస్తూ కూర్చున్న



సీతాలు "ఏందిరా? ఎందలా ఉరుక్కొచ్చి నావు;" అనడిగింది ఆదుర్దాగా.

యాదయ్యకి ఆయాసంతో నోట మాట రాక నోటును తల్లి చేతికందించేడు.

ఏదో కొత్తవస్తువును చూసినట్లు నోటును అటూ ఇటూ తిప్పి చూసింది సీతాలు.

చెమటలు కక్కుతూ ఆయాసపడ్తున్న కొడుకు ముఖంలోకి చూసింది.

ఆమె ముఖంలొ మారుతున్న రంగులను అర్థం చేసుకునే స్థితిలొ లేడు యాదయ్య.

ఒక్క ఉదుటున లేచి యాదయ్య జుట్టు పట్టుకుంది. "ఏందిరా యిది? కొంపముంచేవురా కొడకా, ఎడెత్తుకు వచ్చేవురా? పోలిసోళ్ళకి తెల్సిందంటే సావగొడ్తార్రా" అంటూ ఫెడీఫెడీ మని చెంపలు వాయించింది.

యాదయ్య యెలాగో తల్లి దెబ్బల బారి నుంచి తప్పించుకుని జరిగిన సంగతి చెప్పేడు.

సీతాలు అప్పటికి శాంతించింది. సంతోషము పట్టలేక కొడుకుని కావలించుకొంది. "పాపిష్టిదాన్ని నా చేతులు కాల. బిడ్డని ఎట్ట గొట్టినా" అని తనని తాను తిట్టుకుంటూ వాడి వంటినిండా ముద్దుల వర్షం కురిపించింది.

వారానికి రెండు, మూడు రోజులు 'కూలి'పనికి పోవాల్సి ఉంటుంది యాదయ్య. ప్రతిసారి పది రూపాయలనోటు చేతిలో పడ్తుంది.

ఈ పని దొరికిన దగ్గరనుంచి యాదయ్య, సీతాలుల జీవితం హాయిగా వెళ్ళిపోతోంది. అడుక్కున్నవి కాక. వారానికి వచ్చే ఆదాయంతో రోజూ రెండు పూట్లా కడుపునిండా అన్నం తింటున్నారు.

అలా నాలుగైదు నెలలు గడిచే సరికి యాదయ్యలో కోర్కెలు మొలకెత్తసాగినయ్. ప్రతిరోజూ సినిమాహాలు గేటు దగ్గర పడిగాపులు కాస్తూ వాల్‌పోస్టర్లలోని బొమ్మలనుచూసి తృప్తి పొందే యాదయ్యకిప్పుడు ఎలాగైనా సినిమాచూసి తీరాలన్న కోరిక ఉధృతంగా ఏర్పడింది.

చివరికోరోజు పది రూపాయల కూలి వచ్చిన నాడు ఒక రూపాయ తీసుకుని సినిమా చూసేడు.

ఆ రోజు యాదయ్య జీవితంలో మరుపు రాని రోజులలొ ఒకటి. ఆ మాటలు. ఆటలు. పాటలు, ఫైటింగులు అన్నీ రంగులలొ చకచక జరిగిపోతుంటే తెరకు దగ్గరగా కూర్చున్న యాదయ్య మనస్సుకి ఏవో స్వప్నలోకాలలొ విహరిస్తున్న అనుభూతి కలిగింది. సినిమా నుంచి తిరిగి వచ్చేక తల్లికి అన్నీ పూసగుచ్చినట్టు చెప్పేడు. "ఈ పాలి నువ్ కూడా రావె చిన్మాక" అన్నాడు.

"నాకెందుకె చిన్మాలు; నువ్ సూడు, సాలు" అంది తల్లి.

అప్పటినుంచి వారానికొక సినిమా చూడటం మొదలెట్టేడు యాదయ్య.

ఒక రోజు రాత్రి సినిమాహాల్లొ చంద్రం కనపడ్డాడు యాదయ్యకి. అతని పక్కనే ఒక ఆడమనిషికూడా ఉంది, చంద్రానికి పెళ్ళికాలేదని విన్నాడు. ఆమె వాలకం. వేషం అన్నీ "అదో" తీరులో వున్నాయ్.

అన్నిటికన్న విచిత్రం చంద్రం వేషధారణ వింతగా ఉంది. టెరిను పాంటు. టెర్లిను షర్టు వేసుకున్నాడు. దొరబాబులా ఉన్న చంద్రాన్ని మొదట గుర్తుపట్టలేకపోయేడు యాదయ్య.

చంద్రమే నవ్వుతూ పలకరించేడు "యేందరా? చిన్మా సూబ్బానికి వచ్చినావా?" అంటూ పాన్‌తో గారపట్టిన పళ్ళను బయట పెట్టి నవ్వేడు చంద్రం.

మర్నాడు రేవుదగ్గర కొచ్చినప్పుడు మామూలు కూలీ అవతారంలొనే ఉన్నాడు చంద్రం. ఏమిటీ విచిత్రం అని యాదయ్య ఆలోచిస్తుంటే అతనిని చూసి చంద్రం నవ్వుకున్నాడు.

తరువాత "నాలుగేళ్ళు పోతే నీక్కూడా అన్నీ తెలుస్తయ్‌రా; నువ్ గూడా నాలెక్క అవుతవ్. సూస్తుండు" అన్నాడు.

యాదయ్య ఆనందానికి అవధులు లేవు. "నేను గూడా చంద్రం లెక్క అవుతానా? నేనుగూడా మేడమీద టిక్కెట్టు కొనుక్కొని పక్కనే ఒక ఆడమడిసిని పెట్టుకొని చిన్మాకి పోతానా?" అని పదేపదే అనుకున్నాడు.

ఆ రోజుల్లా చంద్రం స్థానంలో తాను స్వప్లే కలలు గన్నాడు యాదయ్య. ఒక యేడాది గడిచేసరికి చంద్రం కూలిపని చెయ్యటం మానివేసేడు. సేఠ్‌జీకి అసిస్టెంట్‌గా చేరేడు. ఇప్పుడు రేవు దగ్గరికి కూడా టెర్లిన్ బట్టలతోనే వస్తున్నాడు.

యాదయ్య కంతా వింతగా ఉంది. కూలి పని చేసేవాళ్ళకి యింతేసి పైసలు ఎలా వస్తున్నయ్? ఈ సేఠ్‌జీలంతా వారం వారం విదేశాల నుంచి తెప్పించుకుంటున్న సరుకేమిటి? అధికారులతో వాళ్ళు పడే లాలూచీలలోని ఆంతర్యమేమిటి? చంద్రం ఒక్కసారిగా అంత ఉన్నతిస్థానానికి ఎలా వెళ్ళగలిగేడు? ఇలా రకరకాల ఆలోచనలు అతనిని వేధించసాగినయ్.

క్రమంగా అతనికి విషయాలు బోధపడ


రేడియో మెకానిజం

ట్రాన్సిస్టర్, ఎ. సి/డి. సి. ఎ. సి. రేడియోల అసెంబ్లింగ్, రిపేరింగ్ నేర్చుకొనుటకు పుస్తకాలు, మూడవ ముద్రణలు రు. 17/- సినీ మొ॥ ఆంప్లిఫైయరులు రు. 9-50 మరియు 4 నెలలు పోస్టల్ ట్యూషన్ తెలుగులో కలదు.

వివరములకు :

సుభాష్ రేడియో హౌస్. నకిరేకల్, నల్గొండ జిల్లా, (ఎ. పి.)

ఋతుక్రమం ఆలస్యమైతే ?

విచారపడవద్దు ప్రఖ్యాతిగాంచిన 'దేవిపిల్సు' వాడండి

దేవి పిల్సు ముఖ్యంగా ఆలస్యమైన. క్రమముగాకాక పోయిన, బాధతో కూడిన, లేక ఆగిపోయినబహిష్టకు దేవిపిల్సు బాగుగ గుణమిచ్చును




ప్రతిచోటదొరకును

FULL COURSE 28 TABLETS Rs. 11/-
HALF COURSE 14 TABLETS Rs. 6.50

SEENU & Co., MADRAS-21

CITY PHARMA DISTRIBUTORS, BHAVANNARAYANA St. VZA 1

దీర్ఘ రోగులకు ఉత్తమ సిద్ధ వైద్యం!



హస్తప్రయోగం. అంగము చిన్నదై. అవసర కాలమందు అసంతృప్తి. శుక్లనష్టము. నపుంసకత్వము. హెర్నియా. చర్మ వ్యాధులు. పోస్టుద్వారా కూడా వైద్యం చేయబడును. వరిబీజం (బుడ్డి) మూత్రవ్యాధులు ఆపరేషన్ లేకుండ. రండి. డా॥ దేవర, ఫోన్:551. మార్వాడి గుడివద్ద. తెనాలి. బ్రాంచి 9-డి. శివాజీ స్ట్రీట్. మద్రాస్-17.

SUVARNA

కొత్త రూపకల్పన
(హోం సినిమా ప్రొజెక్టర్)



మీరు మీ కుటుంబం. స్నేహితులు సినిమా హాళ్ళలో మాదిరిగానే రంగుల బొమ్మలు కదలటం, డాన్సింగ్. యాక్టింగ్ అన్నీ చూడగలరు. 35 mm ఫిలిమ్ ఉపయోగించాలి. అది ఎలక్ట్రిసిటీ లేదా బ్యాటరీపై నడపవచ్చును. 25 గ॥ ఫిలిం & ఇలస్ట్రేటెడ్ ఇన్‌స్ట్రక్షన్ ఉచితం. ధర రు 30/-. పోస్టేజీ రు. 6/-. జర్మన్ మోడల్ (Sup) ధర రు 45/-. పోస్టేజీ రు. 7/-. రిఫైన్డ్ స్క్రీన్ రు. 5/-. అదనంగా ప్రతి గజం ఫిలిం 25 పైసలు.

ఆరు షాట్ల పిస్తోలు
(లైసెన్సు అవసరం లేదు)



రష్యన్ మోడల్ ఆటో మేటిక్ పిస్టల్. దొంగలు. క్రూర మృగముల బారినుండి మిమ్ము కాపాడుకొండి. డ్రామా. సర్కస్ వారికి మంచి ఉపయోగకరమైనది. 100 షాట్లు ఉచితం. ధర రు. 14-50. డీలక్స్ (నెం.777) రు. 24/- బెల్టు (Sup)తో క్రోమ్ లెదర్ కేస్ రు. 8/- అదనంగా ప్రతి వంద షాట్లు రు. 2/-. పోస్టేజి రు. 4/-. ఇంగ్లీషు లేక హిందీలో వ్రాయండి.

STAR TRADING CO., (WAJ)
Chhapeti, ALIGARH (U. P.)

సాగినయ్. ఆ సేట్‌జీలంతా విదేశాలనుంచి వాచీలను, ట్రాన్సిస్టర్లను. బట్టలను అక్రమ మార్గాలలో తెప్పించుకుని మార్కెట్టులో అమ్ముకుని కోట్లు గడిస్తున్నారు. వాళ్ళ కింద పనిచేసే వ్యక్తులుకూడా తమతమ అంతస్తులనుబట్టి నెలకి వేలు, వందలు చొప్పున సంపాదిస్తుంటారు. ఇదంతా బహిరంగ రహస్యమే! వాళ్ళు కొందరు ప్రభుత్వాధికారులు, నాయకుల సహకారంతో కొట్లకు పడగ లెత్తుతున్నారు. వాళ్ళదగ్గర "సర్కారు"నే కొనగలంత డబ్బుందని విని ఆశ్చర్యపోయేడు యాదయ్య.

వాళ్ళల్లో చాలా మందికి చదువుకూడా రాదు. ఐనా వాళ్ళు అధికారులకు, నాయకులకు లంచం యిచ్చి వాళ్ళను తమ గుప్పెట్లో పెట్టుకుంటున్నారు.

యాదయ్యకీ విషయాలన్నీ బోధపడే సరికి అతనికి ప్రొమోషన్‌కూడా వచ్చింది. ఇప్పుడు వాళ్ళ గ్రూపుకి నాయకుడు యాదయ్యే! నిజాయితీగా. గుట్టుగా పని చేసేవాళ్ళే యిలాంటి పనులకు కావాలి.

ఎవడైనా పొరపాటున "గుట్టు" బట్ట బయలుచేసేడో వాడి శవం మర్నాటికల్లా సముద్రంలో ఉండాల్సిందే! కానీ అంతదాకా పరిస్థితిని ఎవ్వరూ రానీయరు. బయటి ప్రపంచంలోకి వెళ్ళి నీతిగా. నిజాయితీగా పనిచేస్తే యిందులో ఏదోవంతు ఆదాయం కూడా రాదని అందరికీ తెలుసు.

డబ్బు సంపాదించటంలోని సుఖాన్ని రుచి చూసిన తరువాత ఎవ్వరూ దానిని వదులుకోవటాని కిష్టపడరు.

యాదయ్య స్థితి రోజురోజుకీ మెరుగవుతూంది. ఒకసారి ఓడవచ్చినప్పుడు అతనికి వందరూపాయలనోటు ముట్టింది కూడా.

మొదటిసారిగా పదిరూపాయల నోటును పట్టుకున్నప్పుడు ఎంత ఆనందం కలిగిందో అంత ఆనందం కలిగింది యాదయ్యకి. తల్లి చేతిలో ఆ నోటు పెట్టి హాయిగా నిద్రపోయేడా రాత్రి యాదయ్య.

చెట్టుక్రింద నుంచి పూరి గుడిసెలోకి. అక్కడి నుంచి పెంకుటింటి పోర్షనులోకి అక్కడనుంచి డాబా యింటిలోకి అందులో నుంచి పెద్ద బంగళాలోకి మకాం మారింది యాదయ్యది.

సీతాలు సీతాదేవి అయింది. యాదయ్య యాదగిరిరావు అయ్యేడు.

అందరూ యిప్పుడ తనిని రావుసాహెబ్ అంటారు. సీతాదేవిని "అమ్మాజీ" అంటారు.

సీతాదేవి జబ్బు పూర్తిగా నయమయింది. నెరిసిన వెంట్రుకలతో పట్టుచీరలతో సీతాదేవి హుందాగా కనపడుతుంది.

తల్లిని, చూసినప్పుడల్లా రావుకి ప్రపంచాన్ని జయించినంత గర్వంగా, సంతోషంగా ఉంటుంది. నవమాసాలు మోసి. కని పెంచి. తన కోసం ఆరోగ్యాన్ని. అందాన్ని, ఆనందాన్ని. సర్వస్వాన్నీ కోల్పోవటానికి సిద్ధపడిన తల్లియెడల ఏకొడుకు మాత్రం యింతకన్న ఎక్కువగా కృతజ్ఞతను చూపగలడు?

అప్పుడప్పుడు రాత్రిళ్ళు అలసిపోయి పరుపుమీద వాలినపుడు అతని కిప్పటికీ ఫుట్‌పాత్ పక్కన చెట్టుక్రింద ఖంగు ఖంగుమంటూ తల్లి దగ్గుతున్నట్లే అనిపించి ఉలిక్కిపడి, చటుక్కున లేచి కూర్చుంటాడు.

కళ్ళు తెరవగానే లేత నీలిరంగు బల్బు లైటులో తన గదిలో ఉన్న ఖరీదైన ఫర్నిచరు. కిటికీలకున్న సిల్కు తెరల రెపరెపలు కనపడగానే కుదుటపడిన మనసుతో నిద్రపోతాడు.

ఫుట్‌పాత్‌మీద నిలబడి తనా రోజుల్లో కలలు గన్నసుఖాలన్నీ రావుకిప్పుడు పుష్కలంగా లభిస్తున్నాయ్.

సీతాదేవి బంగారు బొమ్మలాటి పిల్లను కోడలిగా తీసుకు వచ్చింది.

ఆ పిల్లకు బంగారపు తొడుగులు తొడిగేవాడు కాని రావు కిప్పుడున్న డబ్బుకి, హోదాకి, స్నేహితుల అంతస్తుకీ... ఆ పిల్ల ఒక్కతే సరిపోదు. డబ్బును మల్లెపూలతో కలిపి విరజిమ్మి రోజుకో అందాన్ని చవి చూస్తున్నాడు.

అన్నిటికన్న గొప్ప విశేషమేమంటే, ఒకప్పుడు ఏ సేట్‌జీల క్రింద అతను కూలీగా పని చేసేడో వాళ్ళందరినీ కలిపి కొనగలంత డబ్బును కూడబెట్టేడు రావు.

ఇప్పుడు రాజకీయ నాయకులు పార్టీ విరాళాల కోసం అతని బంగళాముందు క్యూలో నిల్చుంటున్నారు. కొన్ని పార్టీలకు వేల సంఖ్యలోను, కొన్నిటికి లక్షల సంఖ్యలో కూడా విరాళాలిచ్చేవాడు రావు.

డబ్బు లేనినాడు ఉన్నవాడు కూడా డబ్బు విలువ ఎంతటిదో రావుకి తెలుసు. అందుకే ఎంత కష్టపడి డబ్బును సంపాదించేవాడో అంత ఉదారంగానూ డబ్బును దానం చేసేవాడు.

పోతున్న కారు నాపి ఫుట్‌పాత్ మీద ఉన్న బిచ్చగాళ్ళకి వంద రూపాయలనోట్లు యిచ్చిన రోజులు కూడా ఉన్నయ్. ఆస్తికులు, నాస్తికులు. రాజకీయ నాయకులు, ప్రభుత్వోద్యోగులు, రైతులు, కూలీలు, సినిమా ప్రొడ్యూసర్లు, బిచ్చగాళ్ళు- ఒకరేమిటి ఎవరడిగినా లేదనకుండా డబ్బు విరజిమ్మేవాడు. మళ్ళీ ఆ లోటు పూడ్చడా

నికి క్రీతంకంటే పెద్దయెత్తున దొంగ రవాణా వ్యాపారం చేసేవాడు.

ఒక్క మాటలో చెప్పాలంటే అతను మట్టిని కూడా బంగారం చెయ్యగలంత సమర్థు డయ్యాడు.

అతను చేసే దాన ధర్మాలన్నీ చూసి తోటి స్మగ్లర్సంతా ఆశ్చర్యపోయేవారు. వాళ్ళు కూడా రావులాగానే అట్టడుగు స్థితి నుండి పైకి వచ్చిన వారే. కాని అంత మాత్రాన డబ్బును అలా విరజిమ్మ గలిగే వాళ్ళుకారు. తమ కెప్పుడైనా ఉపయోగ పడతారు అనుకున్న వాళ్ళ దగ్గర లక్షలు ఖర్చుపెట్టి తమకి ఏ మాత్రం ఉపయోగ పడరనుకున్నవాడు ఎంత అవసరంతో అడిగినా డబ్బిచ్చేవాళ్ళుకారు. తాము ఖర్చుపెట్టే ప్రతి పైసాకీ ప్రతిఫలాన్నాశించే వాళ్ళ మన స్తత్వం రావుకి నచ్చేదికాదు.

"డబ్బును బాత్‌రూములోను, పడక గదిలో భూగర్భంలోను దాచేసే లాభమేముంది? డబ్బు సంపాదించేది దాని ఖర్చు పెట్టి మనం ఆనందాన్ని కొనుక్కోవటానికి ఇతరులకు ఆనందాన్ని కలగజేయటానికి మాత్రమే-డబ్బును నువ్వు దాచినకొద్దీ అది నీలోని శాంతినితినేస్తుంది" అంటూ స్నేహితులకు హిత బోధ చేసేవాడు. ఒకప్పుడు వాల్‌పోస్టర్లలో చూసి ఆనందించిన సినీ తారలందరూ తన కడగండి చూపుకోసం తహతహలాడిపోవటం చూసి నవ్వుకునేవాడు రావు.

"నాలో అందం లేదు. ఆకర్షణలేదు. కాని డబ్బు ఉంది అందుకే వాళ్ళు నాచుట్టూ తిరుగుతున్నారు." అనుకునేవాడు.

ఒకప్పుడు సినిమా చూటానికి టికెట్లు కొనలేకపోయిన రావు కిప్పుడు ఇండియాలోని ప్రతి పెద్ద నగరంలోనూ రెండేసి సినిమాహాళ్ళున్నయ్. ఆ సినిమాలు తీసే ప్రొడ్యూసర్లకి తను కల్పతరువు. సినిమాలలో నటించే తారలకి అతని 'రికమెండేషన్' ఎంతో బలాన్నిస్తుంది.

బినా ఏ స్మగ్లరు దగ్గర డబ్బును తీసుకొని ఆ సినిమా తీసేరో ఆ స్మగర్లనే దేశద్రోహులుగా చిత్రిస్తూ సినిమాలు తీసి, లక్షలు సంపాదించి తమ దేశభక్తిని చాటుకుంటున్నారు సినీ నిర్మాతలు.

రాత్రిళ్ళు తన కాళ్ళమీదపడి పార్టీకి విరాళాలు సేకరించి అందులో మూడొంతులు సొంత ఖర్చులకు వాడుకునే రాజకీయ నాయకులు తెల్లారేక "దేశంలో పెచ్చు పెరుగుతున్న అవినీతిని. దొంగ రవాణా వ్యాపారాన్ని ఖండిస్తూ పత్రికా ప్రకటనలు చేస్తుంటే పగలబడి నవ్వాలనిపించేది రావుకి.

ఈ సారి విరాళాలకోసం వచ్చినప్పుడు "మీలాటి దేశభక్తులకు విరాళా లివ్వగల స్తోమతు నాకెక్కడి దండీ?" అనడిగితే ఏమంటారో అనుకునేవాడు.

కాని ఎంతడబ్బు సంపాదించినా రావులో అంతరాత్మ చావలేదు. మనసు వడిలిపోలేదు. హృదయం ముకుళించుకుపోలేదు.

వీళ్ళ చేత అలాటి మాటలనిపిస్తున్నది డబ్బేనని అతనికి తెలుసు. డబ్బే యీ ప్రపంచాన్నంతటినీ పాలిస్తోందనీ, రాజకీయాలు, మతం, కళలు అన్నీ ఆ డబ్బుతోనే నడుస్తాయని అతనికి తెలుసు.

అందుకే వాళ్ళని వెంటనే మనసులో క్షమించగలిగేవాడు.

అన్ని సుఖాలున్నా రావు మనసులో ఈనాటి వరకూ ఒక వెలితిమాత్రం అలాగే ఉంది. అది చదువుకోవాలన్న ఆకాంక్ష.

డబ్బుతో ఇల్లు కొనుక్కున్నాడు. సూళ్లు కొనుక్కున్నాడు. స్నేహితులను కొనుక్కున్నాడు. సినిమా రంగాన్ని కొన్నాడు. రాజకీయాలను కొన్నాడు. కాని చదువును కొనుక్కోలేకపోయేడు.

పాతికేళ్ళు దాటేక పలకా బలపం పట్టుకుని అక్షరాలు నేర్చుకోవాలంటే అతనికి సిగ్గుగా ఉంది. ఈ సుఖా లన్నిటితోపాటు చదువుకూడా ఉంటే ఎంత బాగుండును! అనుకునేవాడు. తనలోని అసంతృప్తిని తీర్చుకోవటానికి స్కూళ్ళకు. కళాశాలలకు విశ్వ విద్యాలయాలకు విరివిగా విరాళాలివ్వటం ప్రారంభించేడు. బీదవిద్యార్థులకు స్కాలర్‌షిప్ లివ్వటానికి కొన్ని నిధులను యిచ్చేడు. అలా కొంత వరకు ఊరట పొందగలిగేడు రావు.

కాని రావు కోరుకున్నట్లు రోజులన్నీ అతనివి కాలేకపోయినయ్. పది సంవత్సరాలపాటు మకుటంలేని రాజుగా వెలిగిపోయిన రావును హఠాత్తుగా "మీసా" క్రింద అరెస్టు చేసేరు.

అతనంతటి వాడు కావటానికి దోహదం చేసిన పోలీసు అధికారులు, మంత్రులు, రాజకీయ నాయకులు ఏవో కొన్ని రాజకీయ కారణాలవల్ల, అమాయక ప్రజల అభిమానాన్ని చూరగొనేందుకో, మరెందుకో తన కెదురు తిరిగినందుకు ఆశ్చర్యం కలగలేదు రావుకి.

"ఎరుదాటేక తెప్పతగలబెట్టే మనుషులు వీళ్ళు" అని అతనికి తెలుసు.

జైల్లో ఇంద్రభోగాలనుభవిస్తూ రెండు నెలలు గడిపేడు రావు.

జైల్లో తనకు జరుగుతున్న రాజోపచారాలు చూస్తుంటే నవ్వు వచ్చింది రావుకి.

"నేరస్థులలోకూడా వర్గాలుంటాయన్న మాట. ఆఖరికి జైల్లో కూడా ఉన్నవాడికి విందు భోజనం, లేనివాడికి లాఠీ దెబ్బలు కాబోలు" అనుకున్నాడు.

చిన్నతనంలో దొంగతనం చేసినా, చేసినట్టు అనుమానం కలిగినా పోలీసులు చావగొడ్తారని విని తను ఎలా భయపడిందీ గుర్తుకు వచ్చింది రావుకి.

ఈనాడు దేశాన్ని ముంచివేసేంత పెద్దయెత్తున దొంగ రవాణా వ్యాపారం చేస్తున్నట్లు తెలిసి కూడా జైల్లో తనని గౌరవంగా చూస్తున్నారు.

బహుశా తన ఉప్పు తిన్న విశ్వాసం గలవారి ఆజ్ఞలతోనే యివన్నీ జరుగుతున్నాయేమో అనుకున్నాడు.

కొన్ని నెలలు గడిచేక అతను కోర్టులో


## అఖిల భారత పాప్యులారిటీ పోటీ

సహాయమునకు 36 మొత్తముగల నమూనా.

1వ బహుమతి : (1) రాజదూత్ మోటారు సైకిలు. 2వ బహుమతి : (1) టేపు రికార్డరు. 3వ బహుమతి : (100) 'టోయో' జపాన్ మోడల్ 3 బ్యాండ్ ట్రాన్సిస్టరు రు. 290/-లో సగం ధర.


| | | |
|---|---|---|
| 11 | 10 | 15 |
| 16 | 12 | 8 |
| 9 | 14 | 13 |

ప్రమోటర్ల తీర్మానము ఖాయమైనది.

ఎంట్రీ ఫీజు లేదు— సాదా కాగితముపై పైమాదిరిగా తొమ్మిది ఖాళీ గడులను తయారుచేయండి. 9 (తొమ్మిది) నుంచి 17 (పదిహేడు) వరకుగల అంకెలను నిలువుగా. అడ్డముగా. అయిమూలగా. ఎటుకూడినా మొత్తం 39 (ముప్పది తొమ్మిది) వచ్చునట్లు ఒక అంకెను ఒకేసారి ఉపయోగించి పై ఖాళీ గడులను పూరించాలి. బహుమతి గెలుపొందిన వారు బహుమతికి సంబంధించిన పోస్టేజీ. ప్యాకింగ్, లైసెన్సు ఫీజు చెల్లించాలి. ఎంట్రీలు హిందీ లేక ఇంగ్లీషులో పంపాలి. ఫలితముల కొరకు 45 పైసల స్టాంపులు పంపాలి.

ఆఖరి క్లోజింగ్ తేదీ : 7-7-75 ఫలితం తేదీ : 8-7-75

Director : CROWN AGENCIES (WAJ-39) P.O. Box No. 1186, Delhi-6.




తన తరపున వాదించుకోవలసి వచ్చింది. తను కనుసైగ చేస్తే పెద్ద పెద్ద లాయర్లందరూ వస్తారు. తన తరపున వాదించటానికి కాని రావు అందుకిష్టపడలేదు.

తను చేసే పని తప్పని తెలిసే తనా పని చేసేడు.

ఆ పని చేస్తేగాని తను మనిషిగా బ్రతకలేడని చేశాడు.

బ్రతికిన నాలుగు రోజులూ సుఖంగా బ్రతకాలనే ఆ పని చేసేడు.




ఏజెంట్లు : (1) సిటీఫార్మా డిస్ట్రిబ్యూటర్స్, భావనారాయణ వీధి, విజయవాడ-1, (ఆ.ప్ర.) (2) ఫార్మా ట్రేడర్స్, (హైద్రాబాద్), కందస్వామి రోడ్, సుల్తాన్ బజార్, హైద్రాబాద్ (ఆం.ప)

నీతిగా నడుచుకుంటే ఈ సంఘంలో కూడు దొరకదని తెలిసే తనా పని చేసేడు.

తను ఎవ్వరికళ్ళూ గప్పి ఈ పని చేయలేదు.

డబ్బుతో వాళ్ళ నోళ్ళు నొక్కేడంతే;

తాను చిన్నతనంలో కలలుగన్న జీవితాన్ని చవిచూసేడు.

తనకు చేతనైన విధంగా యితరులకు సహాయం చేసేడు.

అంతకుమించి మానవ జన్మకింక ఏం కావాలి?

ఇప్పుడు తను తప్పు పని చెయ్యలేదని కోర్టులో అబద్ధం ఆడటానికి రావు అంతరాత్మ అంగీకరించటంలేదు.

తను చేసింది ముమ్మాటికీ తప్పే; తన తప్పుకి ఏ శిక్ష విధించినా అనుభవించటానికి సిద్ధమే!

ఐతే అతను న్యాయస్థానంలో చెప్పదల్చుకున్న విషయాలు కొన్ని ఉన్నాయి.

అవేమంటే "ఇలా నాలాటి స్మగ్లర్లను కొందరిని శిక్షించినంత మాత్రాన సమాజం బాగుపడదు. నాలాటి వాళ్ళను తయారుచేసిన పరిస్థితులను యికముందైనా కల్పించకుండా చూడాలి. పదిహేనేళ్ళుగా ఈ దొంగరవాణా వ్యాపారంతో సంబంధం గలిగిఉన్న నేను యిన్నాళ్ళుగా పట్టుబడకపోవటానికి కారణమేమిటి? వేదికలమీద శ్రీరంగ నీతులుచెప్పే నాయకులందరూ నాలాటివాళ్ళను యాచించి పొందిన డబ్బుతోనే ఆ నాయక పదవిని పొందేరని మీకు తెలిస్తే యేం చేస్తారు? కంచెయే చేను మేసినట్లు దేశంలోని శాంతి భద్రతలను కాపాడవలసిన పోలీసు అధికారులే డబ్బుకి కక్కుర్తిపడి లక్షలకొలది దొంగ సరుకులు రవాణా అవుతుంటే చూసీ చూడనట్లు ఊరుకుంటున్నందుకు వాళ్ళమీద మీరేరకమైన చర్య తీసుకొంటున్నారు. ఏ ఆఫీసులో చూసినా ప్యూన్ దగ్గరనుండి ఆఫీసరు వరకు లంచం తీసుకునేవాళ్ళే! దీనికంతకీ కారణం యేమిటి? ఈ వ్యవస్థలో ఉన్నలోపం. పాలక వర్గంలోని అసమర్థత. ముందు ఈ వ్యవస్థను మార్చండి. పాలకవర్గాన్ని సుశిక్షితం చెయ్యండి. వ్యక్తులు వాళ్ళంతట వాళ్ళే మారతారు. వ్యక్తిగతమైన బలహీనతలు ప్రతి మనిషిలోనూ పుట్టూనే వస్తయ్. స్వభావసిద్ధంగా ప్రతి వ్యక్తీ నేరస్తుడే; ఒక క్రిమినల్! కాని అతనిలోని ఈ పాశవిక ప్రవృత్తిని రెచ్చగొట్టకుండా చూడటం ప్రభుత్వం కనీస కర్తవ్యం. మీరిచ్చే ఏరకమైన శిక్షనైనా అనుభవించటానికి సిద్ధంగా ఉన్నాను నేను. కాని కుళ్ళిపోతున్న ఈ వ్యవస్థ యిప్పటికైనా బాగుపడుతుందా? అట్టడుగునఉన్న మనిషి కనీసావసరాలను తీర్చుకునే శుభదినం ఎప్పటికైనా వస్తుందా? సమాజంలోని అట్టడుగు తరగతినుంచి వచ్చిన ఒక వ్యక్తిగా నేను మిమ్మల్నీ ప్రశ్నలు వేస్తున్నాను. మీ చట్టాలు, ధర్మ శాస్త్రాలు దేశంలోని ప్రతి మనిషికీ కూడూ, గుడ్డా యివ్వలేనప్పుడు వాటిని పొందటానికి తమకి వీలైన మార్గాల నన్వేషిస్తున్నారు ప్రజలు. అందుకే వాళ్ళను నేరస్థులుగా భావించి శిక్షించేముందు అసలు వాళ్ల నేరస్తులు కారని, కొన్ని దుష్టశక్తులు తమ స్వార్థాని కుపయోగించుకునే సాధనాలు మాత్రమేననీ గుర్తించండి. అదే నా ప్రార్థన." అంటూ ముగించేడు రావు.

అతని మనస్సిప్పుడెంతో తేలికగా ఉంది. శిక్ష ననుభవించబోతున్నానన్న భయంలేదు దుఃఖంలేదు.

డబ్బును కొనగలిగినా డబ్బుకి తన అంతరాత్మ నమ్ముకోలేదు రావు. అందుకే అంత క్లిష్టపరిస్థితిలోకూడా అంత నిబ్బరంగా మాట్లాడగలిగేడు. ★

